ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నేటి నుంచి భీమడోలు రైల్వే గేటు మూసివేత

భీమడోలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈనెల 20వ తేదీ నుంచి 30వ తేదీవరకూ భీమడోలు రైల్వే గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ ఉదయం 7 గంటల నుంచి రైల్వే గేటు మూసివేస్తారని ఈ మార్గాల నుంచి వెళ్ళే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గం ఎంచు కోవాలని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

గ్యాస్ అదనపు వసూళ్లకు పాల్పడితే చర్యలు : జేసీ

ఏలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో దీపం-2 కింద ఉచిత గ్యాస్ సిలెండర్ల దారుల నుంచి అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుంచి 150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీల డెలివరీ బాయ్‌లు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో అవి వాస్తవమైతే ఆయా ఏజెన్సీలను బ్లాక్‌లిస్టులో పెట్టి వారి లైసెన్సులు రద్దు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. అదనంగా డబ్బులు వసూలు చేస్తే 180042 56453 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చెయ్యవచ్చునన్నారు. గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేశాక మూడు రోజుల్లోపు తమ ఖాతాల్లో జమ అవుతున్నాయని లబ్ధిదారులు చెబుతున్నారని జేసీ వివరించారు.



ముదినేపల్లి మండలం చినకామనపూడిలో పైలట్ ప్రాజెక్టు రీసర్వే చేస్తున్న సర్వేయర్లు

పకడ్బందీగా పైలట్ ప్రాజెక్టు రీసర్వే

- రైతుల సమక్షంలోనే భూముల సరిహద్దుల గుర్తింపునకు చర్యలు
- జాయింట్ ఎల్‌పీల సమస్యకు తెర

ముదినేపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం భూముల సర్వేకు చేపట్టిన పైలట్ ప్రాజెక్టులో భాగంగా ముదినేపల్లి మండలం చినకామనపూడి గ్రామ ఏరియాలోని ఆయకట్టు భూముల రీసర్వేను రెవెన్యూ అధికారులు చేపట్టారు. ఆ గ్రామానికి పక్కనే ఉన్న చిగురుకోట, పెదకామనపూడి, మండవల్లి మండలం లింగాల రెవెన్యూ విలేజీలకు సరిహద్దులను డ్రోన్ సర్వేలో పూర్తి కాగా, తాజాగా ఆ సరిహద్దుల మధ్య చినకామనపూడి గ్రామ ఏరియాలోని ఆయకట్టు భూములను రీసర్వే పనులను అధికారులు చేపట్టారు. గతంలో డ్రోన్ రీ సర్వేలో జరిగిన పొరపాట్లకు తావు లేకుండా, జాయింట్ ఎల్‌పీల సమస్యలు తలెత్తకుండా, భూముల విస్తీర్ణంలో ఎటువంటి తేడాలు లేకుండా శాశ్వత సర్వే రికార్డులను రూపొందించేందుకు కూటమి ప్రభుత్వం చేపట్టిన ఈ పైలట్ ప్రాజెక్టులో రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే జరుగుతోంది. సరిహద్దులను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన రోవర్ అనే మిషన్‌ను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ భూములను గుర్తించేస్తున్నారు. అనంతరం రైతుల సమక్షంలో ప్రైవేట్ భూముల రీసర్వే చేపడతారు. తహసీల్దార్ సుభానీ ఆధ్వర్యంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస ప్రసాద్, మండల సర్వేయర్ రాజశేఖర్ రెడ్డి, గ్రామ సర్వేయర్, వీఆర్వోలతో కూడిన రెండు టీములు పాల్గొన్నాయి.





సమావేశంలో పాల్గొన్న కొల్లేరు గ్రామ పెద్దలు.. మాట్లాడుతున్న కొల్లేరు నాయకుడు సైదు సత్యనారాయణ

కొల్లేరులో పక్షులే కాదు.. ప్రజలూ ముఖ్యమే..

ఏలూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కొల్లేరులో పక్షులు, పర్యావరణం ఎంత ముఖ్యమో... ఆ ప్రాంత ప్రజల జీవనాధారం కూడా అంతే ముఖ్యమని కొల్లేరు సంఘం నాయకుడు సైదు సత్యనారాయణ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఆదివారం ఏలూరు రూరల్ మండలంలోని కొల్లేరు నాయకులు, గ్రామ పెద్దలు, బంటా పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కొల్లేరులో 122 గ్రామాల్లో 4 లక్షల మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారన్నారు. 76,196 ఎకరాలు కొల్లేరులో ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కొల్లేరు ఆపరేషన్ జరిగి లంక గ్రామాల ప్రజలు సర్వం కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తడినేలల పేరుతో 120 జీవో తీసుకువచ్చి చెరువులు ధ్వంసం చేశారని ఫలితంగా గ్రామాల ప్రజలు వలసలు పోయారని ఇప్పుడు సుప్రీంకోర్టు ఆదేశాలతో కొల్లేరు ప్రజల జీవనోపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము పర్యావరణానికి వ్యతిరేకం కాదన్నారు.పాలకులు, అధికారులు ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కొల్లేరు గ్రామాల్లోని ప్రజలు ఐక్యంగా కొల్లేరును రక్షించుకుందామని పిలుపునిచ్చారు. కొల్లేరు ప్రాంత ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి త్వరలో భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో ఏలూరు రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నంబూరి నాగరాజు, మాజీ అధ్యక్షుడు నేతల రవి, పైడిచింతపాడు, కలకుర్రు, శ్రీపర్రు, గుడివాకలంక, పత్తికోళ్లలంక, పెదయాగనమిల్లి గ్రామాలకు చెందిన పెద్దలు, కొల్లేరు నాయకులు పాల్గొన్నారు.

భూమి సిద్ధం



2016లో వట్లూరు వద్ద రాకెట్ విడి భాగాల పరిశ్రమకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు(ఫైల్)



వట్లూరు సమీపాన అందుబాటులో ఉన్న 330 ఎకరాలు

ధాన్యాగారంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా తీర్చిదిద్దడం సాధ్యమేనా..? దీనికి తగ్గట్టుగా అనువైన భూమి అందుబాటులో ఉందా..? ఔత్సాహికులు ముందుకొచ్చేందుకు సానుకూలంగా స్పందిస్తున్నారా..? కూటమి పక్షాన ఈ మేరకు ప్రోత్సాహం ఉందా..? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమే వినిపిస్తున్నది. గతంలో పరిశ్రమలు లేని జిల్లాగా ఉన్న ఈ ప్రాంతాన్ని ఇప్పుడు కొత్తగా పారిశ్రామికీకరణ దిశగా ముందుకు నడపాలనే తాపత్రయమే అందరిదీ. ప్రభుత్వం అందుబాటులో ఉన్న భూమిని ఈ మేరకు వినియోగించుకోవడానికి సంసిద్ధంగానే ఉంది. రాబోయే ఆరు నెలల్లోనే సరికొత్త ఒరవడి సృష్టించేందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకుంటుంది.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

పరిశ్రమల ఏర్పాటుకు ఇదే అదను

- జిల్లాలో అందుబాటులో భూమి
- ఇంతకు ముందున్న అనుభవాలను అధిగమించాల్సిందే..
- గతంలో పెద్ద పరిశ్రమలు ఔట్
- ఊతమిస్తేనే నిరుద్యోగులకు ఉపాధి
- ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై దృష్టి

వరితోపాటు వాణిజ్య పంటలకు నెలవైన ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలంటే పారిశ్రామికీకరణ ఒక్కటే మార్గం. అనువైన భూమి, అందుబాటులో నీరు పుష్కలంగా ఉన్న ఈ ప్రాంతంలో ఔత్సాహికులు ముందుకొస్తే జిల్లా స్వరూపాన్ని మార్చడానికి వీలుంది. ఇప్పటికే ఏలూరు సమీపాన వట్లూరు గ్రామం వద్ద దాదాపు 330 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. ఈ భూమిలోనే ఒకప్పుడు నిట్ కళాశాల ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఆ మేరకు 2016లోనే కేంద్రాన్ని ఒప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున పలుమార్లు ప్రయత్నించారు. అప్పటి ఉమ్మడి పశ్చిమ జిల్లాలో నిట్ ఏర్పాటుకు అనుగుణంగా కేంద్రం కూడా స్పందించింది. ఈ దిశగా చర్యలకు ఉపక్రమించగా తాడేపల్లిగూడెంలోనూ నిట్‌కు పూర్తి అనుకూలత ఉందంటూ అప్పటి ఎమ్మెల్యే, మంత్రి పైడికొండల మాణిక్యాలరావు కేంద్ర పెద్దలను ఒప్పించే ప్రయత్నం చేశారు. అప్పట్లో కేంద్రంతో టీడీపీ ప్రభుత్వం స్నేహపూర్వక వైఖరి కొనసాగిస్తున్న తరుణంలో ఏలూరులో కాకుండా గూడెంలోనే నిట్ ఏర్పాటుకు కేంద్రం మొగ్గు చూపితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. అప్పట్లో ఈ పరిణామంపై స్థానికంగానే కాక టీడీపీలోను ఒకింత అసంతృప్తికి దారితీసింది.

రాకెట్ తయారీ విడి భాగాలు

రాకెట్ తయారీలో విడి భాగాలు సమకూర్చేందుకు మరో పరిశ్రమకు ఈ ప్రాంతంలో ఒక ప్రతిపాదన వచ్చింది. అప్పట్లో ఉండి ఎమ్మెల్యేగా ఉన్న వేటుకూరి శివరామరాజు కుటుంబానికి చెందిన వెంకాం తాము రాకెట్ విడి భాగాల తయారీ పరిశ్రమ స్థాపనకు సిద్ధంగా ఉన్నామని, ఇప్పటికే హైదరాబాదు శివారులో ఈ తరహా పరిశ్రమ నిర్వహిస్తున్నామనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వచ్చారు. ఈ విడి భాగాల తయారీ పరిశ్రమ నెలకొల్పితే స్థానికులు వేలాది మందికి ఉపాధి అవకాశాలు మెరుగు పడడమే కాకుండా ఈ ప్రాంత పురోభివృద్ధికి ఆలంబనగా ఉంటుందనే విషయాన్ని గమనించి ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. వెనువెంటనే ముఖ్య మంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పరిశ్రమ ఏర్పాటుకు అనువుగా పునాది రాయి పడింది. ఇంకేముంది పరిశ్రమ వస్తే ఉపాధి అవకాశాలు పుంజుకుంటాయని స్థానికుల్లో హర్షామోదాలు వ్యక్తమ య్యాయి. ఈ పరిశ్రమకు అనువైన భూమిని ప్రభుత్వం సమకూర్చినప్పటికీ దీనికి తగ్గట్టుగా నిర్మాణ పనులను ప్రారంభించ లేకపోయారు. ఈలోపే తెలుగుదేశం ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ పరిశ్రమ నిర్మాణం పూర్తిగా వెనుకంజ వేసింది. అప్పటి జగన్ ప్రభుత్వం కూడా ఇంతకు ముందు చేసుకున్న ఎంవోయును రద్దు చేసు కోవడానికి ముందు కొచ్చింది. పరిశ్రమ యాజమాన్యం ఇక చేసేదిలేక చేతులెత్తేసింది. ఈ విధంగా రెండో విడత కూడా భూమి అందుబాటులో ఉన్నా పరిశ్రమ స్థాపన జరగకుండానే పోయింది.

ఫుడ్ ప్రాసెసింగ్ వైపు..

తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందుబాటులో ఉన్న భూమిలో పరిశ్రమ స్థాపనకు అనువుగా కదలికలు వచ్చాయి. తాను గెలిస్తే ఈ ప్రాంతంలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను రప్పిస్తానని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగానే గడిచిన మూడు నెలలుగా ఆయన ఢిల్లీలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ల ఏర్పాటుకు అనువుగా ఆయా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలతో పదేపదే సంప్రదింపులు జరిపారు. ఆయా మంత్రులను కలిసి ఫుడ్ ప్రాసెసింగ్‌కు తమ ప్రాంతం అనువైనదిగా వారికి నచ్చజెప్పారు. దీనికి ఆయా మంత్రిత్వ శాఖల్లో సానుకూలత వ్యక్తమైనట్టు ఎంపీ మహేష్‌కుమార్ యాదవ్ ఇప్పటికే పదేపదే ప్రకటిస్తున్నారు. అనువైన భూమి ఉంది. మౌలిక సదుపాయాల కల్పనకు అవకా శాలున్నాయి, ప్రభుత్వ ప్రోత్సాహానికి కొదువలేదు, సాధ్యమైనంత త్వరలోనే ఈ ప్రక్రియ పూర్తవుతుందనే విశ్వాశాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు మామిడి, ఆక్వా ఉత్పత్తులు, కూరగాయలు అత్యధికంగా అందుబాటులో ఉన్న తరుణంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయనే భావన అందరిలోనూ ఉంది.

3 వేల ఎకరాల అటవీ భూమి

వాస్తవానికి ఏలూరు జిల్లా వ్యాప్తంగా మెట్టభూములు అత్యధికంగా ఉండడం, మరోవైపు అటవీ భూములు కూడా అందుబాటులో ఉన్నాయి. పెదవేగి మండలం రామశింగవరం ప్రాంతంలో మూడు వేల ఎకరాలు అటవీ భూమి ఉన్నట్టు 2016లోనే అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నిర్ధారించింది. ఈ ప్రాంతంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందనే విషయంలో అధికారిక బృందాలు పదేపదే ప్రాంతాన్ని పరిశీలించాయి. ప్రభుత్వానికి స్పష్టమైన నివేదికలు ఇచ్చాయి. చిన్న, పెద్ద తరహా పరిశ్రమల ఏర్పాటుకు అనువైన స్థితిగతులు ఈ ప్రాంతంలో ఉన్నట్టుగా ప్రత్యేకించి పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేయడానికి తొలుత రోడ్డు మార్గం విస్తరించాలని సూచించారు. అప్పట్లో సమయాభావంతో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటు చేయకపోవడం, ఆ తరువాత టీడీపీ ఓటమిపాలు కావడంతో ఇది మరుగున పడింది. చింతలపూడి ప్రాంతంలో కూడా చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తే పోలవరం నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు వస్తాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది కాబట్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు మిగతా వారంతా ఈ ప్రాంతంపై దృష్టి పెడితే పారిశ్రామికీకరణకు కొంతలో కొంత వెసులుబాటు కలుగడమే కాకుండా ఉపాధి అవకాశాలు పూర్తిగా మెరుగుపడతాయి.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు టూటౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 20 నుంచి 31వ తేదీ వరకు పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం శిబిరాల పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పశుపోషణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.27 మండలాల్లో మండలంలో రెండు చోట్ల పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక్కొటీమ్‌లో ఒక్కో పశువైద్యుడు ఒక పారా వెటర్నరీ సిబ్బంది, పశువైద్య సహాయకులు గోపాలమిత్రలు ఉంటారన్నారు. పశుసంవర్ధక శాఖ ఇన్‌ఛార్జ్ జేడీ డాక్టర్ గోవిందరాజు మాట్లాడుతూ ఆరోగ్య శిబిరాల్లో గొర్రెలు, మేకలకు, లేగదూడలు, పాడిపశువులకు నట్టల నివారణ మందులు వేస్తారన్నారు. అనారోగ్యంగా ఉన్న పశువులకు చికిత్స అందిస్తామన్నారు. గర్భకోశ వ్యాధులకు, ఎదకురాని పశువులకు పరీక్షలు నిర్వహించి చికిత్స అందజేస్తామ న్నారు. వీటితో పాటుగా 14 మండలాల్లో లేగదూడల అందాల పోటీలు నిర్వహిస్తామన్నారు. గెలుపొందిన లేగదూడల యజమానులకు బహుమతులు అందజేస్తామన్నారు.

భావి తరాలకు ఆదర్శం యోగి వేమన సందేశం



యోగి వేమన చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి , జేసీ ధాత్రి రెడ్డి

ఏలూరు, (ఆంధ్రజ్యోతి) : తేట తెలుగు పదాలతో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో తన పద్యాల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన ప్రజాకవి యోగి వేమన అని జిల్లా కలెక్టర్ కెవెట్రిసెల్వి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఆదివారం యోగి వేమన జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన పద్యాల సందేశాలను నేటి యువతతో పాటు భావితరాలకు అందించేందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారివిశ్వేశ్వరరావు,డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, డీఈవో వెంకటలక్ష్మమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ గోవిందరాజులు, పర్యాటకశాఖ మేనేజర్ పట్టాభి, ఐసీడీఎస్ పీడీ శారద, కలెక్టరేట్ ఏవో నాంచారయ్యలు పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఏదీ ?



- పది నెలలుగా పెండింగ్
- సర్పంచ్‌ల ఆవేదన

ఏలూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కడుపు నింపుకుంటే కాళ్ళ మీదపడినట్లుగా ప్రస్తుత సర్పంచ్‌ల పరిస్థితి నెలకొంది. పదినెలలుగా గౌరవ వేతనం అందడం లేదని గ్రామాల్లోని ప్రథమ పౌరులైన సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. " ఉద్యోగులకు జీతాలు అందకపోతే వారితో, వీరితో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తున్నాం. మా వేతనం రాకపోతే ఎవరికి చెప్పుకోవాలి" అని సర్పంచ్‌లు ప్రశ్నిస్తున్నారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి గౌరవవేతనం, బకాయి ఉంది. ఏలూరు జిల్లాలో 426 మంది సర్పంచ్‌లు ఉన్నారు. వారికి నెలకు ప్రభుత్వం గౌరవవేతనం కింద రూ.3 వేలు చెల్లిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వం ఈ మొత్తం చెల్లించేందుకు కూడా ముప్పుతిప్పలు పెట్టింది. పలు సందర్భాల్లో రోడ్లు ఎక్కాల్సి వచ్చింది. ఎన్నికల సమయంలో సర్పంచ్‌లు దూరం అవుతారన్న ఆలోచనతో అప్పటివరకు ఉన్న బకాయిలను గతేడాది మార్చినెలలో వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. తరువాత ఎన్నికలు రావడంతో వేతనాల చెల్లింపులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరు వాత గ్రామ పరిపాలన, సంబంధిత వ్యవహారాల్లో సర్పంచ్‌లను కీలకమైన వారిగా ప్రకటించింది. గౌరవవేతనం చెల్లింపులపై సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. అయినా చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.


వినతిపత్రం ఇచ్చాం..



సర్పంచ్‌ల గౌరవ వేతనంపై సీఎం కార్యా లయ అధికారులతో పాటు పంచా యతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శిని కలిసి వినతిపత్రం ఇచ్చాం. తప్పకుండా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. అధికారులు క్రమం తప్పకుండా ప్రతినెల నిధులు, విడుదలకు కృషిచేయాలి.

-పాలడుగు లక్ష్మణరావు, ఏలూరు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు

వెంటనే విడుదల చేయాలి



పదినెలలుగా గౌరవ వేతనం రాక పోవడం బాధాకరం. గత వైసీపీ ప్రభుత్వం ముప్పు తిప్పలు పెట్టింది. పైగా 14,15 ఆర్థిక సంఘం నిధులను కూడా ఇతర పథకాలకు మళ్ళించింది. పంచా యతీలకు మొండిచేయి చూపించింది. కూటమి ప్రభుత్వంలో ప్రతినెల గౌరవ వేతనం అందేలా చూడాలి.

- కె.సత్యనారాయణ, సర్పంచ్, జంగారెడ్డిగూడెం మండలం , చక్రదేవరపల్లి

మాజీ సర్పంచ్ హత్య కేసులో అరెస్టు -7లో

జోరందుకున్న రబీ సాగు

ఇతర పంటలూ ముమ్మరం



ఏలూరుసిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సాగు నిర్ధేశించుకున్న లక్ష్యానికి అనుగుణంగానే జరుగుతోంది. ప్రస్తుతం నీటి కష్టాలు లేకపోయినా రాబోయే రోజుల్లో సాగునీటి పరిస్థితులు ఎలా ఉంటాయో అన్న ప్రశ్న తలెత్తుతోంది. ప్రస్తుతం జిల్లాలో 98 వేల 798 ఎకరాల్లో వరి సాగు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ లక్ష్యంగా నిర్ధేశించుకుంది. జిల్లాలో ముమ్మరంగా వరి నారుమళ్ళు వేస్తున్నారు. సకాలంలో కౌలు రైతులకు రుణాలు అందక పోవడంతో ప్రైవేటు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎరువుల భారం కూడా రైతులను కొంత ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తోంది. జిల్లాలో ఈ ఏడాది రబీ సీజన్‌లో 4940 ఎకరాల్లో వరి నారుమళ్ళు వేయాల్సి ఉండగా ఇప్పటివరకు 2935.1 ఎకరాల్లో వరి నారుమళ్ళు వేశారని జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. 98వేల 798 ఎకరాల్లో వరి సాగు లక్ష్యం కాగా ఇప్పటివరకు 38వేల 740 ఎకరాల్లో నాట్లు వేశారని వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

ఇతర పంటల సాగు

రబీ సీజన్‌లో ఇతర పంటల సాగు కూడా జరు గుతోంది. మొక్కజొన్న 90 వేల 46 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 36వేల 273 ఎకరాల్లో సాగు చేశారు. జొన్న 116 ఎకరాలకు గాను 4 ఎకరాల్లో సాగు చేశారు. పెసలు 15వేల 847 ఎకరాలకు 8065 ఎకరాల్లో, మినుములు 23 వేల 437 ఎకరాలకు 19వేల 291 ఎకరాల్లో ఇప్పటివరకు సాగు చేశారు. చెరకు 3,121 ఎకరాలకు ఇప్పటివరకు 240 ఎకరాల్లో సాగు చేశారు. వేరుశనగ 2856 ఎకరాలకు 1347 ఎకరాల్లో సాగు చేశారు. నువ్వులు 84 ఎకరాలకు 5 ఎకరాల్లో సాగు చేశారు. పొగాకు 25వేల 88 ఎకరాలకు ఇప్పటివరకు 19 వేల 632 ఎకరాల్లో పంటవేశారు. మొత్తం రబీలో 2,59,873 ఎక రాల్లో అన్ని పంటలు సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు జిల్లాలో 1,23,608 ఎకరాల్లో సాగు చేపట్టినట్టు జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి.

కౌలు రైతులకు రుణాలు అంతంత మాత్రమే

జిల్లాలో కౌలు రైతులకు రుణాలు అంతంత మాత్రంగానే ఇచ్చాయి. పెట్టుబడులు లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రబీలో ప్రతీఏటా సాగు నీటి ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది ఇప్పటివరకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకపోయినా రాబోయే రోజుల్లో ఈ సాగు నీటి ఇబ్బందులు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఎరువుల ధరలు మార్కెట్‌లో భారీగా పెరగడం వల్ల రైతులు అదనపు భారం మోయాల్సి వస్తోంది.

కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి



నిర్లక్ష్యానికి స్పాట్

- ఇంటర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనంలో పొరపాట్లు
- విద్యార్థులకు అగచాట్లు
- అధ్యాపకుల అశ్రద్ధపై ఇంటర్ బోర్డు చర్యలు
- షోకాజ్ నోటీసులు.. అపరాధ రుసుం

ఏలూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఆదమరిచి ఉంటే జరిగే నష్టం ఎలా ఉంటుందో తెలుసుకోవడానికి ఇదో నిదర్శనం. గత విద్యా సంవత్సరం (2023-24)లో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో కొందరు అధ్యాపకులు నిర్లక్ష్యంగా పేపర్లను దిద్దటంతో రెగ్యులర్, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో పలువురు విద్యార్థులు ఫెయిల్ కావడమో లేదా మార్కులు తక్కువగా పడటమో జరిగిపోయాయి.ఆయా సబ్జెక్టుల్లో రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌లకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల జవాబు పత్రాలను నిపుణులతో కూడిన కమిటీతో పరిశీలన చేయించగా జిల్లాలో స్పాట్ వాల్యుయేషన్ విధుల్లో పాల్గొన్న అధ్యాపకుల్లో కొందరు చేసిన పొరపాట్లు బహిర్గతమయ్యాయి. దీంతో కొందరు విద్యార్థులకు జరిగిన నష్టాన్ని ఇప్పటికే భర్తీచేసిన ఇంటర్ బోర్డు ఉన్నతాధికారులు తాజాగా సంబంధిత మూల్యాంకన విధుల్లో పాల్గొన్న అధ్యాపకులను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీచేయడంతో పాటు, మూల్యాంకనంలో చేసిన తప్పిదాలకు అపరాధ రుసుం విధించారు. ఈ నోటీసులు గత డిసెంబరులో సంబంధిత అధ్యాపకులకు జారీచేసి, వారిపై దాదాపు రూ.లక్ష జరిమానా విధించిన విషయం ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. గతేడాది మార్చిలో జరిగిన ఇంటర్ రెగ్యులర్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనంలో 25 మంది అధ్యాపకులకు, ఫలితాలు వెలువడిన తర్వాత జరిగే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఆన్సర్ స్క్రిప్టులను మూల్యాంకనం చేసిన అధ్యాపకుల్లో 27 మందికి షోకాజ్ నోటీసులు జారీచేసి, వారుచేసిన తప్పిదం తీవ్రత, మోతాదును బట్టి మొత్తం రూ.లక్షవరకు జరిమానా విధించారు. మూల్యాంకన విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని ఏడాది పాటు పరీక్షల విధులకు, స్పాట్ విధులకు దూరంగా ఉంచాలని నిబంధనల మేరకు అధికారులు నిర్ణయించడం గమనార్హం.ఇలా ఇంటర్‌బోర్డు బ్లాక్‌లిస్టులో పెట్టిన అధ్యాపకుల్లో స్క్రూటినైజర్లు, ఎగ్జామినర్లు, చీఫ్ ఎగ్జామి నర్లు వున్నట్టు సమాచారం. కాగా రీకౌంటింగ్, రీవెరి ఫికేషన్ కోసం ఆయా సబ్జెక్టుల జవాబు పత్రాలకు నిర్ణీత రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పునఃమూల్యాంకనంలో మార్కులు పెరగడం, ఫెయిలైన పలువురు పాస్‌కావడం విశేషం. స్పాట్ విధుల్లో నిర్లక్ష్యం, నిర్ధారణ జాబితాలో జవాబుపత్రంలో అన్ని ప్రశ్నలు/ జవాబులను పూర్తిగా గమనించి మార్కులు ఇవ్వకుండా కొన్నింటిని వదిలేయడం, నిర్దేశిత నిబంధనల మేరకు ఆయా జవాబులకు ఇవ్వాల్సిన మార్కులకంటే తక్కువ మార్కులను ఇవ్వడం, తదితర అంశాలున్నట్టు తెలిసింది.

నేత్రపర్వం.. తిరువీధిసేవ



ద్వారకాతిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): శ్రీవారి క్షేత్రంలో ద్రవిడ ప్రబంధ అధ్యయ నోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ముక్కోటి పర్వదినం మొదలుగా ఈ ఉత్స వాలను పదిరోజుల పాటు జరపడం ఇక్కడ సాంప్రదాయబద్ధమైంది. అధ్యయనోత్సవంలో భాగంగా ఆదివారం సాయంత్రం ఉభయ దేవేరులతో స్వామివారిని తొళక్క వాహనంపై ఉంచి నిత్యకల్యాణ మండప ఆవరణలోకి తెచ్చారు. మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై ఉంచిన బంగారు సింహాసనంపై ఉత్సవమూర్తు లను ఉంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనను అర్చకులు జరిపారు. అనంతరం నవకలశస్న పన, అభిషేకాలను నిర్వహించారు. ఆ తరు వాత తిరుమంజనాలు జరిపి స్వామి, అమ్మ వార్లకు హారతులిచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, పండితులు సేవాకాలాన్ని జరిపి భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. ఆతర్వాత శ్రీవారి తిరువీధిసేవ క్షేత్రంలో వైభవంగా జరిగింది.

గట్టుకు మోక్షం ఎప్పుడో..?



» ఏడాదిగా ఎక్కడి పనులు అక్కడే

» అదనపు నిధుల కోసం ఎదురుచూపు

నరసాపురం, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): పట్టణానికి ఆనుకుని కోతకు గురైన ఏటిగట్టు పనులు ఏడాదిగా మధ్యస్థంగా నిలిచిపోయాయి. అమ రేశ్వరస్వామి ఆలయం నుంచి పొన్న పల్లి రేవు వరకు సుమారు 400 మీటర్ల మేర పని చేపట్టాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు 300 మీటర్ల పూర్తి చేశారు. ఇంకా 100 మీటర్ల పనులు జరగాల్సి ఉంది. ఏడాదిగా మధ్యస్థంగా పనులు నిలిచిపోవడంతో గట్టుమీద వాహనాలు వెళ్లే మార్గం లేకుండా పోయింది.

గత ప్రభుత్వ హయాంలో సుమారు రూ.25కోట్ల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించారు. గతంలో ఉన్న గట్టు వెడల్పును పెంచారు. పనుల ప్రారంభంలో పలు మార్లు గట్టు జారిపోతూ వచ్చింది. దీనిపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేనలు పలు మార్లు ఉద్యమాలు చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. నాణ్యమైన రాళ్ళతో గట్టు పటిష్ఠ పనులు జరగడం లేదని, దీనిపై విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారులు తనిఖీలు చేపట్టాలని అప్పటి గవర్నర్, ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఆచంట బహిరంగ సభలో ఏటిగట్టు అవినీతిపై ప్రస్తావించారు. తాము అధికారంలోకి వస్తే విచారణ చేయిస్తామని అన్నారు. ఈ నేప థ్యంలో అప్పటి ప్రభుత్వం ఇంజనీరింగ్ చీఫ్ అధికారుల బృందాన్ని నరసాపురం పంపి ంది. అధికారులు పనుల్ని పరిశీలించారు. టెక్నికల్ ఇంజనీర్ల సూచనలతో పనుల్ని మొదలు పెట్టి 300 మీటర్ల వరకు గట్టు పనులు పూర్తి చేశారు. మళ్లీ అప్పటి నుంచి జార లేదు. ఇటీవల వరదలకు కూడా బల ంగానే నిలబడింది. ఈనేపథ్యంలో పెండి ంగ్‌లో ఉన్న 100 మీటర్ల పనుల్ని కూడా పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. ఇందుకు మరో రూ.4 కోట్లు ఖర్చు అవుతు ందని ప్రతిపాదనలు పంపారు. అయితే రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పనులకు గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. దీనిపై ఏటిగట్టు శాఖ ఏఈ సుబ్బారావు వివరణ ఇస్తూ.... చేపట్టిన గట్టు పనులు పటిష్ఠంగానే ఉన్నా యన్నారు. ఇటీవల వరదలకు కూడా కృంగ లేదన్నారు. ఇంకా 100 మీటర్ల పెండింగ్ ఉంది. నిధులు విడుదల కాగానే పనులు పూర్తి చేస్తామన్నారు.

నేడు ఆచంట పోలీసు స్టేషన్ భవనం ప్రారంభం

డీజీపీ ద్వారకాతిరుమల రావు రాక



నూతన భవనంలో రూమ్‌లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పితాని, ఎస్పీ నయీం అస్మి, డీఎస్పీ శ్రీవేద తదితరులు

ఆచంట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆచంట లో నూతనంగా నిర్మించిన పోలీసు స్టేషన్ భవనాన్ని సోమవారం ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పరిశీలించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ భవనం ప్రారంభానికి అనేక మంది ప్రజాప్రతినిధులు హాజరవుతున్నారని, అందువల్ల పోలీసు అధి కారులు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎస్పీ మాట్లాడుతూ భవన ప్రారంభోత్సవానికి డీజీపీ ద్వారకాతిరుమల రావు కూడా హాజరవుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ బొర్రా గురుమూర్తి, నరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేద, సీఐ రాయుడు విజయ కుమార్, ఎస్‌ఐ కట్టా వెంకటరమణ తదితర పోలీసు అధికా రులు పాల్గొన్నారు.



సూపర్ సీనియర్స్ చేగొండి వెంకట హరిరామ జోగయ్య, అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ)లను సత్కరిస్తున్న మంత్రి నిమ్మల

సీనియర్ల బాటలో అభివృద్ధికి కృషి చేస్తా

- మంత్రి నిమ్మల

పాలకొల్లు అర్బన్ /టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు నియోజకవర్గం నుం చి ప్రాతినిధ్యం వహించి అభివృద్ధికి బాటలు వేసిన నేతలు చేగొండి హరిరామజోగయ్య, అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ)ల బాటలో పయనిస్తానని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. లయన్స్ క్లబ్ హాల్లో ఆదివారం రాత్రి జరిగిన సీనియర్ సిటిజన్ల సంఘ సమావేశంలో ముఖ్యఅతిథిగా మంత్రి నిమ్మల పాల్గొని మాట్లాడారు. సభకు సంఘ అధ్యక్షుడు వంగా నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సీనియర్ సిటిజన్ల సంఘ అధ్యక్షుడు వెంపరాల సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రం ప్రగతి పథంలో వందే భారత్ రైలు మాదిరిగా పరుగులు తీస్తోందని అన్నారు, పోలవరం ప్రాజెక్టు, అమరావతి నిర్మాణాలు, విశాఖ ఉక్కు, రైల్వే జోన్ వంటి వాటితో దేశంలో వేగంగా అభివృద్ధి చెందే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఉందన్నారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు చేగొండి హరిరామ జోగయ్య, అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) లను ఘనంగా సత్కరించారు. ముందుగా సీనియర్ సిటిజన్లు అయిన కళాకారులు రాజా తాతయ్య, ఐ వెంకటేశ్వరరావు, సీవీవీ సత్యనారాయణ మూర్తి, వీఎస్ఎన్ మూర్తి, సీహెచ్ ప్రసాద్, దుర్గా పాలేశ్వరి తమ కళలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి జీఎస్ఎన్ మూర్తి, వై.వెంకట రత్నం, జిల్లా సంఘ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, చాంబర్ అధ్యక్షుడు కేవీఆర్ నరసింహరావు, వీవీ తిరుపతిరాజు మాట్లాడారు. కార్యక్రమంలో అత్యం ఆదిశేషయ్య, వంగా శేషారావు, కె సూరిబాబు, కె.రవిశంకర్, కర్నేన గౌరునాయుడు, గుండా రామకృష్ణ, ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బైక్, కార్లకు లైఫ్ టాక్స్ మినహాయింపు

జిల్లా రవాణా అధికారి ఉమామహేశ్వరరావు

భీమవరంక్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను (లైఫ్ టాక్స్) మినహాయింపు అవకాశాన్ని జిల్లాలో నూతన విద్యుత్ వాహన కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రవాణా అధికారి టి.ఉమామహేశ్వరరావు కోరారు. 2019 కి ముందు విద్యుత్ వాహనాలు కొనుగోలుపై అమలు కాబడిన జీవిత పన్ను మినహాయిం పుని రాష్ట్ర ప్రభుత్వం మరలా ఈ నెల నుంచి అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఆంధ్రప్ర దేశ్‌లో కాలుష్యం రోజురోజుకు తీవ్రమవుతున్న దృష్ట్యా, వాయు కాలుష్య నియంత్రణ చర్యలలో భాగంగా ప్రభుత్వం విద్యుత్ వాహనాల ద్వారా కాలుష్యం తగ్గించవచ్చుని సమీక్ష చేసి, విద్యుత్ బైకులు, కార్లకు జీవిత పన్ను మినహాయింపు మరల అమలులోకి తీసుకురా వడం జరిగిందన్నారు. మన రాష్ట్రంలో కొనుగోలు చేసిన, రిజిస్టర్ చేసుకున్న అన్ని స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నును మినహాయిస్తూ ఐదు సంవత్సరాల కాలం పరి మితికి జనవరి 2025 నుంచి జనవరి 2030 వరకు అమలులో ఉండేలా ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు పన్ను మినహా యింపు స్వచ్ఛమైన ఎలక్ట్రిక్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుందని, హైబ్రిడ్ వాహనాలకు వర్తించదన్నారు. అలాగే ఇతర రాష్ట్రాలు ఆంధ్ర ప్రదేశ్ టి.ఆర్ జారీ చేసిన వాహనాలకు, ఆంధ్ర ప్రదేశ్‌లోని డీలర్లు ఇతర రాష్ట్రాలకు టి.ఆర్‌లు జారీచేసిన లైఫ్ టాక్స్‌మినహాయింపు వర్తించ దని తెలిపారు. కావున రాష్ట్రం వెలుపల ఎలక్ట్రిక్ టి.ఆర్ పట్ల విద్యుత్ వాహన కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

నేటి నుంచి కోలమూరులో సురభి నాటకోత్సవాలు

ఉండి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి 23 వరకు కోలమూరులో సురభి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీసంతాన గోపాలస్వామి ఆలయ కమిటీ ఈ విషయాన్ని తెలిపింది. 20వ తేదీ రాత్రి 7గంటలకు మాయబజార్ పౌరాణిక నాటకం, 21వ తేదీ రాత్రి శ్రీకృష్ణలీలలు పౌరాణిక నాటకం, 22వ తేది రాత్రి లవకుశ పౌరాణిక నాటకం, 23వ తేదీ రాత్రి శ్రీనివాసకల్యాణం పౌరాణిక నాటకాలు ప్రదర్శింపబడతాయని తెలిపారు. ఈ నాటకాలను రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణ రాజు ప్రారంభిస్తారని ఆలయకమిటి చైర్మన్ నంబూరి బదిరీనారాయణరాజు, కార్యనిర్వహ ణాధికారి మంతెన రామరాజు తెలిపారు.

నేటి నుంచి సదరం సర్టిఫికెట్ల పరిశీలన

తణుకు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): తణు కు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నేటి నుంచి సద రం సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. జిల్లా లోని లబ్ధిదారులు తణుకు కేంద్ర ఆసుపత్రికి రావాల్సి ఉంటుంది. ఇందుకోసం తగిన ఏర్పా ట్లు చేస్తున్నారు. వైసీపీ హయాంలో ఇబ్బడి ముబ్బడిగా సదరం సర్టిఫికెట్లను జారీ చేశా రు. అప్పట్లో అనర్హులు సర్టిఫికెట్లు పొందు తున్నారనే ఆరోపణలు వచ్చాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో సుమారు 14 వేల మంది లబ్ధిదారుల సర్టిఫికెట్లను వైద్యు లు పరిశీలించి వైకల్యం నిర్ధారించాల్సి ఉంది. ఇతర ప్రాంతాల ఆస్పత్రుల నుంచి ప్రత్యేక వైద్యులను నియమించారు. ప్రత్యేక శిబిరాలు సోమ, మంగళ, బుధవారాల్లో ఉంటాయి. ఇలా మూడు నెలలు పాటు శిబిరంలో సదరం ప్రత్యేక తనిఖీలు చేస్తారు.

మార్చిలో పాలకొల్లు కళాపరిషత్ నాటిక పోటీలు

పాలకొల్లు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో మార్చి 15, 16, 17 తేదీలలో నాటికల పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు కేవీ కృష్ణ వర్మ, కార్యదర్శి జక్కంపూడి కుమార్ తెలిపారు. పోటీలకు 8 నాటికలు ఎంపిక చేశామని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ శుక్రవారం అరవింద్ ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి, ఉషోదయం కళానిలయం కట్రపాడు వారి కిడ్నాప్, 16వ తేదీ ఆదివారం మిత్రా క్రియేషన్ హైదరాబాద్ వారి ఇది రహదారి కాదు, చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి అసత్యం, మద్దుకూరి క్రియేషన్స్ చిలకలూరిపేట వారి మా ఇంట్లో మహాభారతం నాటికలు 17వ తేదీ సోమవారం అమరావతి ఆర్ట్స్ గుంటూరువారి చిగురు మేఘం, పండూ క్రియేషన్స్ కొప్పోలు వారి పక్కింటి మొగుడు, నటీ నట సమాఖ్య పాలకొల్లు వారి అనూహ్యం (ప్రత్యేక ప్రదర్శన) నాటికలు ప్రదర్శించ బడతాయని కృష్ణ వర్మ, జక్కంపూడి కుమార్ తెలిపారు.

28, 29,30 తేదీల్లో మెగా ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్

టి.నరసాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొర్రంపాలెంలో జరగనున్న మెగా ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్‌కు టీమ్ లను ఆహ్వానిస్తున్నట్లు టోర్నమెంట్ కన్వీనర్ కె.విజయ్ ఆదివారం తెలిపారు. జడ్పీటీసీ సభ్యులు సామంతపూడి బాల సూర్య నారా యణరాజు (సూరిబాబు) పుట్టినరోజు సంద ర్భంగా ఈనెల 28, 29,30 తేదీల్లో బొర్రం పాలెంలో మెయిన్‌రోడ్డు పక్కన సూరిబాబు స్థలంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహి స్తు న్నట్లు తెలిపారు. విజేతలకు మొదటి బహు మతి రూ.50 వేలు, 2వ బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.5 వేలు అందిస్తున్నామని తెలి పారు. టోర్నమెంట్‌లో పాల్గొనే టీమ్‌లు ఈనెల 26 లోపు రూ..500 ఎంట్రీఫీజు చెల్లించి రిజి స్ట్రేషన్ చేయించుకోవాలని వివరాలకు 96766 69597 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

కొబ్బరికాయలు కొట్టే భక్తుల నుంచి అక్రమ వసూళ్లు

ఫిర్యాదు చేసిన ఓ భక్తుడు



సెక్యూరిటీకి ఫిర్యాదు చేస్తున్న భక్తుడు.

ద్వారకాతిరుమల, జనవరి 19 (ఆంధ్ర జ్యోతి): చిన వెంకన్న ఆలయ ప్రాంగణంలో యాత్రికులు కొబ్బరికాయలు కొట్టే ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు మద్యం సేవించి భక్తులను డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆలయ సెక్యూరిటీకి ఫిర్యాదు అందింది. కొబ్బరి చెక్కలు ప్రోగుచేసుకునే కాంట్రాక్టరు వద్ద పనిచేస్తున్న వీరు ప్రతీరోజూ కొబ్బరికాయలు కొట్టే యాత్రి కులను డబ్బు డిమాండ్ చేస్తున్నట్లు చెబుతు న్నారు. ఒక్కో భక్తుని నుండి రూ.10 నుంచి రూ.20 వరకూ డబ్బు ఇవ్వకపోతే యాత్రి కులను దుర్భాషలాడుతున్నట్లు చెబుతున్నారు. ఈక్రమంలో ఆదివారం పిప్పర నుంచి కుటుం బంతో వచ్చిన ఓ భక్తుడు కొబ్బరి కాయలు కొట్టేందుకు అక్కడకు వచ్చాడు. వారిని డబ్బులు అడిగి ఇవ్వకపోయేసరికి దుర్భాష లాడాడంటూ సెక్యూరిటీకి ఆ భక్తుడు పిర్యాదు చేశాడు. ఈ పిర్యాదును సెక్యూరిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అక్రమ వసూ ళ్లకు పాల్పడిన ఇద్దరిలో ఓ వ్యక్తిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు.

ఆటో బోల్తా : ఒకరికి గాయాలు



ముదినేపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం రాత్రి ఆటో బోల్తా పడిన సంఘటనలో గురజ గ్రామానికి చెందిన తొందూరు నాగరాజు తీవ్ర గాయాలకు గుర య్యాడు. మచిలీపట్నం నుంచి గురజ గ్రామం లోని చేపల చెరువుల వద్దకు మేత కట్టలు తీసుకొచ్చిన ఆటో తిరిగి ముదినేపల్లి నుంచి మచిలీపట్నం వెళ్తుండగా, జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న గోతుల్లో బోల్తా పడింది. ముదినేపల్లిలో ఆటో ముగ్గురు ఎక్కగా వారిలో నాగరాజు అనే వ్యక్తి ప్రమాదంలో గాయాలకు గురయ్యాడు. వెంటనే పోలీసులు అతనిని 108 వాహనంలో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తర లించారు.

వివాహిత అదృశ్యం..కేసు నమోదు

ఉండి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. ఉండి మండలం మహ దేవపట్నం గ్రామానికి చెందిన చేపల కనక మహా లక్ష్మీ (28) తనభర్తతో విడిపోయి తల్లిదం డ్రులు వద్దే వుంటున్నది. సంక్రాంత్రి పండుగకు తనకు బట్టలు కొనలేదని తల్లితో గొడవపడి ఈనెల 15న మధ్యాహ్నం బయటకు వెళ్లిపో యింది. బంధు వులు, సన్నిహి తులు ఇళ్లవద్ద వెదకినా కని పించక పోవ డంతో పోలీసు లకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

క్రైమ్ కార్నర్



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తిరుపతి కృష్ణ

అల్లరి మూకలు దాడి.. ఒకరికి గాయాలు

ఏలూరు క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : అతి వేగంగా మోటారు సైకిల్ ఎందుకు నడు పుతున్నారంటూ ప్రశ్నించిన ఒక యువకుడిని అల్లరి మూకలు దాడిచేసి గాయపరిచారు. ఏలూరు నగరంలో రాత్రివేళ అల్లరిమూకల జోరు పెరిగిపోయింది. హోటళ్ళు తెల్లవార్లు తెరిచి ఉండడంతో అల్లరిమూకలు నగరంలో బైక్‌లపై చక్కర్లు కొడుతున్నారు. అతి వేగంగా వాహనాలు నడుపుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. శనివారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఏలూరులోని నరసింహారావుపేట డిగ్రీ కాలేజీ సమీపంలో ముగ్గురు యువకులు బైక్‌పై అతి వేగంగా చక్కర్లు కొడుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన కాళిదాసు, తిరుపతి కృష్ణ వారిని ప్రశ్నించారు. దీంతో అక్కడ గొడవ జరిగింది. అక్కడ ఉన్న కొంత మంది సము దాయించి ఆ యువకులను పంపించి వేశారు. తిరిగి కొంత సమయం తరువాత కొత్తపేట నుంచి మరి కొంతమంది యువకులను తీసు కువచ్చి కర్రలతో, రాడ్లతో తిరుపతిస్వామిపై దాడి చేశారు. దీంతో తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పిం చారు. సన్ని, కొత్తపేటనకు చెందిన సాయి, పవన్, మరో కొంత మంది కలిసి తనపై దాడి చేశారంటూ బాధితుడు పేర్కొన్నాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం రైల్వే పట్టాలపై ఉందని ఏలూరు రైల్వే పోలీసులకు ఆదివారం రాత్రి సమాచారం అందింది. దీంతో రైల్వే ఎస్‌ఐ సైమన్ సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలోని చిట్టివలస పాకల వద్ద రైలు పట్టాలపై సుమారు 50 నుంచి 55 ఏళ్ళ వయసు ఉన్న వ్యక్తి మృతదేహం ఉంది. పట్టాలు దాటుతుంటే ప్రమాదవశాత్తు రైలు ఢీ కొన్నట్లుగా ప్రాథమికంగా భావిస్తున్నారు. 5.6 అడుగుల ఎత్తు కల్గి ఉన్నాడు. లేత ఆకు పచ్చ రంగు పొడవు చేతుల చొక్కా, ముక్కు పొడెం రంగు డ్రాయర్ కల్గి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్‌ఐ సైమన్ నంబర్ 99892 195 59కు సమాచారం అందించాలని కోరారు.

మామిడి తోటలో మందు పార్టీ

ఆరుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలంలోని లక్కవరం గ్రామ శివారులోని ఓ మామిడితోటలో శని వారం అర్ధరాత్రి పార్టీ చేసుకుంటూ అల్లరి సృష్టి స్తున్నట్లు వచ్చిన సమాచారంతో జంగా రెడ్డిగూడెం సీఐ కృష్ణబాబు, లక్కవరం ఎస్సై శశాంక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వారి నుంచి 23 తెలంగాణ మద్యం సీసాలు (ఎన్‌డిపి), ఐదు కార్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపినట్లు సీఐ తెలిపారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు నమోదు

టి.నరసాపురం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి గాయపరిచిన నలుగురు వ్యక్తుల పై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు తెలిపారు. వీరభద్రవరం గ్రామానికి చెందిన దొప్పసాని చిన్న వెంకటేశ్వరరావు ఈనెల 17వ తేదీన దూడకు జాడు తెచ్చు కోవడానికి తన పొలం వద్దకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు ఆస్తి గొడవల నేపథ్యంలో తలపై రాడ్‌తో కొట్టగా త్రీవంగా గాయం అవడంతో జంగా రెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో చే ర్పించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమా చారంతో పోలీసులు కేసు నమోదు చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న భీమవరం డీఎస్పీ జయసూర్య.. స్వాధీనం చేసుకున్న ఆయుధాలు,ఫోన్లు

రొయ్యల వ్యాపారి కిడ్నాప్ కేసులో ఏడుగురి అరెస్ట్

పరారీలో ఐదుగురు
ఆయుధాలు, ఫోన్లు స్వాధీనం
నగదు లావాదేవీలే కారణం

భీమవరం క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఈ నెల 16వ తేదీన కిడ్నాప్‌కు గురైన విశ్వనాథుని వెంకట సత్యనారాయణ (నాని) కేసును కొద్ది గంటల్లోనే ఛేదించి ఏడుగురిని అరెస్ట్ చేసిన ట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన వెంకట సత్యనారాయణకు సోమిశెట్టి సత్యప్రసాద్, యిన్నమూరి లక్ష్మీ వెంకట మల్లికార్జున సురేష్‌బాబులకు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. వెంకట సత్యనారాయణ కొందరి వద్ద డబ్బులు తీసుకుని అవి వేరే వ్యాపార స్తులకు ఇచ్చి కమీషన్ తీసుకునేవాడు. ఆ కోవలోనే పై ఇద్దరి నుంచే కాకుండా వారి బంధువుల వద్ద సుమారు 3 కోట్ల వరకు అప్పు తీసుకున్నాడు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ ఇచ్చి తిరగ రాసేవాడు. కరోనా సమయం నుంచి వడ్డీగాని, అసలు గాని చె ల్లించడం లేదు. దీంతో 2021 సంవత్సరంలో తిరగ రాయడంతో మొత్తం వడ్డీతో సహా రూ.10 కోట్ల 70 లక్షల వరకు ఇవ్వవలసి వచ్చింది. దీంతో సత్యప్రసాద్, సురేష్‌బాబులు డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చెయ్యడం మొద లుపెట్టారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతా మని కూడా బెదిరించారు. సత్యనారాయణ స మాధానం చెప్పకపోవడంతో ఎలాగైనా డబ్బులు రాబట్టాలని పన్నాగం పన్నారు.

కిడ్నాప్ ప్లాన్..

అనంతపురంలో సత్యప్రసాద్‌కు తెలిసిన కాకతీయ రెస్టారెంట్ యజమాని ఆశిష్‌తో ఈ విషయాన్ని తెలిపాడు. ఆశిష్ తనకు తెలిసిన లోకేష్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. లక్షల్లో డబ్బులు ఇస్తామని చెప్పడంతో లోకేష్ కిడ్నాప్‌కు ప్లాన్ వేశాడు. దీంతో కొంత మందిని కిడ్నాప్ చెయ్యడానికి పురమాయిం చాడు. రెండు కార్లలో ఈ నెల 15వ తేదీన భీమవరం వచ్చి రెక్కీ నిర్వహించారు. 16వ తేదీన వెంకట సత్యనారాయణ టౌన్ రైల్వే స్టేషన్‌కు రావడం చూసి కారులో వచ్చిన కొందరు సఫారీలో వచ్చి ఇంటిలిజెన్స్ పోలీసు లమని సత్యనారాయణను కారులో తీసుకువె ళ్ళారు. దీంతో బాధితుడి కుమారుడు సాయి నాథ్ ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కాళీచ రణ్ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ద్వారా వారు తీసుకువెళ్ళిన కారు అనంతపు రం వెళ్ళిందని తెలుసుకుని అక్కడ పోలీసు లను అలెర్ట్ చేశారు. అయితే వెంకట సత్యనా రాయణను హత్య చేసి అయినా తమ డబ్బులు రాబట్టాలని సత్యప్రసాద్, సురేష్ బాబులు కిడ్నాపర్లకు చెప్పడంతో మారణా యుధాలు తీసుకువచ్చి హత్య చేస్తామని అనడంతో తనను భీమవరం తీసుకువెళితే తనకు ఉన్న ఆస్తిని అమ్మి అయినా డబ్బులు ఇచ్చేస్తానని చెప్పడంతో మూడు కార్లలో సత్యనారాయణను ఈనెల 18వ తేదీన భీమవరం తీసుకువచ్చారు. భీమవరం గరగ పర్రు రోడ్‌లో ఖాళీ ప్రదేశంలో నిలబెట్టి వారందరూ చుట్టుముట్టి బెదిరిస్తూ ఉండ టంతో పోలీసులు అక్కడకు వెళ్ళి ఏడుగురిని అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. వారి వద్ద ఉన్న మూడు కార్లు, తొమ్మిది ఫోన్లు, ఒక డైరీ, ఒక వాకీటాకీ, ఒక కత్తి, మూడు వికెట్లు, రెండు హాకీ స్టిక్కులు, ఒక ఆధార్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. సీఐలు కాళీచరణ్, శ్రీనివాసరావు, నాగరాజు, ఎస్‌ఐలు రెహ్మాన్, ఇజ్రాయేల్, గోపి, నరేష్, గోవింద్‌రావు తదితరులు ఉన్నారు.

సంతోషపురం మాజీ సర్పంచ్‌ది హత్యే



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్

కైకలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : పక్కా ప్రణాళిక ప్రకారమే సంతోషపురం మాజీ సర్పంచ్ హత్య జరిగినట్టు ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం కైకలూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. కలిదిండి మండలం సంతోషపురం గ్రామ మాజీ సర్పంచ్ కాలవ నల్లయ్య(58) కలిదిండి గ్రామంలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో నల్లయ్యకు 15 ఎకరాల చేపలచెరువు ఉంది. అదే గ్రామానికి చెందిన బోదనపు శ్రీనివాసరావుతో చెరువు బోదె విషయంలో గొడవలు జరుగుతున్నాయి. నల్లయ్య వల్ల పదేపదే సమస్యలు తలెత్తడంతో హతమార్చాలని శ్రీనివాసరావు ప్రణాళిక సిద్ధం చేశాడు. ఈ నెల 16న నల్లయ్య బైక్‌పై చెరువు నుంచి కలిదిండి వస్తుండగా శ్రీనివాసరావు ఎదురుగా బైక్‌పై వచ్చి బలంగా ఢీ కొట్టాడు. నల్లయ్య కింద పడిపోవడంతో వెంట తెచ్చు కున్న ఇనుపరాడ్డుతో మెడపై కొట్టడమే కాకుండా కత్తితో పలుమార్లు దాడి చేసినట్టు డీఎస్పీ తెలిపారు. రక్తపు మడుగులో ఉన్న నల్లయ్యను స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు డీఎస్పీ తెలిపారు.పరారీలో ఉన్న శ్రీనివాసరావును ఆదివారం అదుపులోకి తీసుకున్నట్టు స్పష్టం చేశారు. కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, కలిదిండి ఎస్సై వి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

ఆసుపత్రిలో అత్యవసర పనుల అంచనాల నివేదికివ్వాలి : కలెక్టర్

ఏలూరు క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేపట్టవలసిన అత్యవసర పనుల అంచనాల ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం సర్వజన ఆసుపత్రిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాతాశిశు సంరక్షణ భవనం, ప్రవేశ మార్గం వద్ద వీల్‌చైర్స్ సులువుగా వెళ్లేందుకు ర్యాంపు ఏర్పాటుకు, ఆసుపత్రి చుట్టూ ఉన్న డ్రెయిన్ల ద్వారా మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేందుకు అవసరమైన డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుపర్చేందుకు అవసరమైన అంచనాలతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్, ఆసుపత్రుల ఇంజనీరింగ్ విభాగం ఇంజనీర్లు సమన్వయం చేసుకుని సంబంధిత ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎంరాజు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, నగర పాలక సంస్థ ఈఈజీ సురేంద్రబాబు, తహసీల్దార్ జీవీ శేషగిరి తదితరులు ఉన్నారు.


ఆసుపత్రి డ్రెయినేజీ వ్యవస్థ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి


శెట్టిబలిజ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి, సంఘ నాయకులు

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం : బడేటి చంటి

ఏలూరుటూటౌన్/ఏలూరు రూరల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కార మార్గాలు చూపడమే లక్ష్యమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడారు వైసీపీ ప్రభుత్వంలో తిష్టవేసిన సమస్యల పరిష్కారానికి ఆహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. భవిష్యత్తులో సమస్యల రహిత నగరంగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతానన్నారు. వచ్చిన వారి నుంచి సమస్యలను అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. శివప్రసాద్, రెడ్డి నాగరాజు, బెల్లంకొండ కిషోర్, మారం హనుమంతరావు, ఎ.తిరుపతి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

శెట్టిబలిజ సంక్షేమ సంఘం ముద్రించిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరవల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు కోడి దుర్గారావు, వై.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ శెట్టిబలిజల సంక్షేమ సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. మధుసూదన్‌రావు, గుబ్బల రామకృష్ణ, కె.శ్రీను, చింతపల్లి గోవింద్, జి.నాని, ప్రసాద్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడికి మూడు సెంట్ల ఇంటి స్థలం : చింతమనేని

పెదవేగి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి మూడు సెంట్ల ఇంటిస్థలం అందించి, పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో ఆదివారం పలువురు ప్రజలు సమస్యల పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందించారు. ఇళ్ల స్థలాలను ఇప్పించాలని కొంతమంది ప్రజాప్రతినిధులు చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ఆయన అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఇంటిస్థలం అందించే దిశగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేసిందన్నారు. వైసీపీ పాలనలో పేదలకు ఇల్లు నిర్మించి ఇస్తామని చెప్పి మోసం చేసిందని గుర్తుచేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు పట్టాలు ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మేకా కనకరాజు, మాగంటి నారాయణప్రసాద్, మంచినేని శ్రీనివాసరావు, లావేటి శ్రీనివాస్, నంబూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న లక్ష్మీపురం సర్పంచ్ కనకరాజు

జీసీజీటీఏ జిల్లా అధ్యక్షుడిగా మర్రి వెంకటేశ్వరరావు

ఏలూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ (జీసీజీటీఏ) జిల్లాశాఖ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగాయి. సంఘ జిల్లా అధ్యక్షుడిగా బుట్టాయగూడెం జీడీసీ అధ్యాపకులు మర్రి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా జంగారెడ్డిగూడెం జీడీసీ అధ్యాపకులు టీవీ రాంబాబు, కోశాధికారిగా కైకలూరు జీడీసీ అధ్యాపకులు కె.రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలు పదవులకు మరికొందరిని నియమించారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సంఘ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాశాఖ అధ్యక్షుడు ఎం.రాంబాబు నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. జిల్లా వ్యాప్తంగా వున్న ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు ఎన్నికల్లో పాల్గొన్నారు. నూతన కార్యవర్గానికి స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.


కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాంబాబు

లెక్చరర్ సరస్వతికి సావిత్రిబాయి పూలే అవార్డు

చింతలపూడి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న డాక్టర్ భరోత్ సరస్వతికి గిరిజనులకు అందించిన సేవలకుగాను దక్షిణ ప్రైవేటు అధ్యాపకులు, ఉపాధ్యాయుల ఆర్గనైజేషన్ సంస్థ సావిత్రీబాయి పూలే ప్రతిభ అవార్డును గుంటూరులో ఆదివారం అందించింది. గిరిజన లంబాడీ తండాకు చెందిన సరస్వతి పేద కుటుంబంలో పుట్టి ఇంటర్ చదువుకునే స్తోమతలేక తల్లిదండ్రుల నిర్ణయంతో మండలంలోని రేచర్ల గ్రామానికి చెందిన భూక్యా సోములను వివాహం చేసుకున్నారు. భర్త ప్రోత్సాహంతో 2000లో ఎస్జీటీ ఉపాధ్యాయురాలిగా, 2009లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. 2018 నుంచి స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న ఆమె మాట్లాడుతూ పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, సమావేశాల్లో పాల్గొని సుమారు 35కుపైగా పరిశోధన పత్రాలను సమర్పించానని చెప్పారు. ఎంతోమంది గురువుల స్ఫూర్తి, అంచెలం చెలుగా ఎదిగిన కృషి ఫలితమేనన్నారు. గుంటూరులో సంస్థ ఆధ్వర్యంలో దంపతులకు అవార్డు అందచేసి శాలువా కప్పి సన్మానించినట్టు చెప్పారు.


లెక్చరర్ సరస్వతి దంపతులకు సన్మానం


సీఆర్ఆర్ కళాశాల ఎంకాం 1978-80 బ్యాచ్ పూర్వవిద్యార్థులు

సీఆర్ఆర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఏలూరు అర్బన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సీఆర్‌రెడ్డి కళాశాల ఎం.కాం (1978-80) బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం కళాశాల ఆవరణలో జరిగింది. అప్పటి పీజీ అధ్యాపకులు కె.శ్రీమన్నారాయణ, కేవీఆర్.ఎస్.కొండయ్యరావు, షేక్ హుస్సేన్, ప్రొఫెసర్ వి.సుబ్బారావులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. కళాశాల క్యాంపస్‌లో పీజీ విద్యార్థులుగా చదివినరోజుల్లో తమ అనుభవాలను గుర్తుచేసుకోగా, అధ్యాపకులు కూడా తమ ఓల్డ్ స్టూడెంట్స్‌తో జ్ఞాపకాలను పంచుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రామరాజు, కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, విజయ్‌కుమార్‌లను సత్కరించారు. పూర్వవిద్యార్థుల సంఘం ప్రతినిధులు వేములపల్లి రత్నబాబు, ఎస్.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

నిలిచిన రహదారి నిర్మాణ పనులు

- బిల్లు పెండింగ్‌తో పనులు నిలిపిన కాంట్రాక్టర్
- దుమ్ము ధూళితో ప్రయాణికులు, స్థానికులకు తప్పని అవస్థలు
- సొంత ఖర్చుతో రహదారిని తడిపిస్తున్న టీడీపీ నేత

కుక్కునూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : కుక్కునూరు-భద్రాచలం, కుక్కునూరు - అశ్వారావుపేట ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణ పనులు గత కొన్నినెలలుగా నిలిచిపోయాయి. రూ.40 కోట్లతో నిర్మాణ వ్యయంతో రహదారి పనులు ప్రారంభించగా ఇప్పటికే సగం పైగా పనులు పూర్తయ్యాయి. దాదాపు రూ.7కోట్లు బిల్లు పెండింగులో ఉండడంతో కాంట్రాక్టరు పనులు నిలిపివేశాడు. ఈ క్రమంలో రహదారిపై దుమ్ముధూళిలేచి ప్రజలు ప్రయాణించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ఇబ్బందులు గమనించిన టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు సొంత ఖర్చులతో ముందుకొచ్చారు. రోజుకు రెండు వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసి దుమ్మధూళి లెగకుండా రహదారిని నీటితో తడుపుతున్నారు. స్థానిక ప్రజలు, ప్రయాణికుల ఇబ్బందులను నుంచి కొంతమేరకు కాపాడుతున్నారు.


కుక్కునూరు రహదారిని ట్యాంకు నీళ్లతో తడుపుతున్న దృశ్యం



పెదరావిగూడెం రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

రహదారి పనులు వెంటనే చేపట్టాలి : సీపీఐ ఆందోళన

కుక్కునూరు ప్రధాన రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఆందోళనకు దిగారు. పెదరావిగూడెం ప్రధాన రహదారిపై ఆందోళన నిర్వహించారు. నిర్మాణ పనులు చేపట్టి మధ్యలో వదిలేయడంతో రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై ప్రయాణిస్తుంటే దుమ్ముధూళి పైకి లేచి ప్రజలు రోగాల భారిన పడుతున్నారని వాపోయారు. ఆందోళనలో ఎం.వెంకటాచారి, ఎం.రమణయ్య, బాబూరావు, భిక్షం, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు, వృద్ధుల రక్షణకు ప్రత్యేక చర్యలు

ఏలూరు క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని బాలికలు, వృద్ధులు, బలహీన వర్గాలకు చట్టాల ద్వారా రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, ఎస్ఐ వి.కాంతిప్రియ అన్నారు. రాష్ట్రంలోనే ఏలూరు జిల్లాలో ప్రప్రథమంగా వినూత్న కార్యక్రమాలకు ఎస్పీ కిశోర్ చర్యలు చేపట్టారు. మహిళా సిబ్బందితోనే జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో మహిళా రక్షక దళ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఎవరైనా ఆపదలో ఉన్న 112కు కాల్ చేస్తే పది నిమిషాల్లోపే మహిళా రక్షక దళ బృందం అక్కడకు చేరుకుంటుందన్నారు. బాల్య వివాహాలు నిర్మూలించడానికి హెల్ప్ లైన్ నంబరు 1098కు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏలూరు నగరంలో కండ్రికగూడెం సెంటర్, పలు ప్రాంతాల్లో డిజిటల్ వాహనంతో ప్రచార కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు స్పెషల్ డ్రైవ్

ఏలూరు క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. హైకోర్టు ఉత్తర్వులతో జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాలతో జిల్లాలోని పోలీసులందరూ ఆదివారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఇప్పటివరకు ద్విచక్ర వాహనాలపై ఉన్న ఈ-చలానాలను అప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా చెల్లించే విధంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పాతబస్టాండ్ వద్ద ఈ స్పెషల్ డ్రైవ్‌ను ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణ్, ఎస్ఐ రంగారావు, వారి సిబ్బంది నిర్వహించారు.

ఘనంగా వేమన జయంతి

భీమడోలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : మహాకవి, సంఘసంస్కర్త యోగివేమన అపూర్వజ్ఞానాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు శాఖ గ్రంథాలయంలో ఆదివారం యోగి వేమన జయంతి నిర్వహించారు. గ్రంథపాలకుడు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భాగంగా వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా చిన్నారులు పుస్తకాలు చదివి సమీక్షలు రాశారు. గ్రామస్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బోడిగూడెంలో పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవం

ఏలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం మండల బోడిగూడెం గ్రామంలో ఆదివారం జరిగిన పీసా కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు డిప్యూటీ తహసీల్దార్ కంభంపాటి శ్రీనివాస్ తెలిపారు. అధ్యక్షుడిగా తామా బాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా పాయం సోమశేఖర్ ఎన్నికైనట్టు తెలిపారు. సర్పంచ్ కొక్కిర వెంకటలక్ష్మి సున్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

ఏలూరుకార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఐక్య ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని, కార్మికుల పోరాటాలను ఉధృతం చేస్తామని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో కార్మిక, కర్షక ఐక్యతా దినోత్సవాన్ని సీఐటీయూ, రైతు వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్, రామకృష్ణ మాట్లాడుతూ 1982 నుంచి కార్మిక, కర్షక హక్కుల కోసం ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, కార్మిక సంఘ నాయకులు పి.రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, ఎం.ఇస్సాకు, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి పి.మంగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాజీ సైనికులను సన్మానిస్తున్న సంఘ అధ్యక్షుడు భాస్కరరావు, తదితరులు

ఘనంగా ఆర్మీ డే వేడుకలు

ఏలూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఏలూరు జిల్లా మాజీ సైనిక సంఘం ఆధ్వర్యంలో ఆర్మీ డే దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ప్రత్యేక అధికారిగా జేఎస్‌డబ్ల్యూవో కేవీఎస్ ప్రసాద్‌రావు హాజరయ్యారు. అమర జవాన్ స్థూపం వద్ద అమర సైనికులకు నివాళి అర్పిస్తూ కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 180 మంది మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 80 ఏళ్లు పైబడిన మాజీ సైనికుల్ని ఘనంగా సత్కరించారు. మాజీ సైనికుల సమస్యలు, వారికి అమలు చేసే పథకాలపై చర్చించారు. వేడుకల్లో సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేతినేడి భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి చింబార్కర్ రమేష్, ఉపాధ్యక్షులు శ్యామ్‌గణేష్, బి.సుబ్బారావు, రెడ్డి రామారావు, గౌరవ అధ్యక్షుడు వాసుకీ శర్మ, సభ్యులు ఎంఎస్‌వీ సుబ్రహ్మణ్యం, మదన మోహన్‌రావు, జేవీఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.



ఏలూరులో అమిత్‌షా గోబ్యాక్ అంటూ వామపక్షాల నాయకుల నిరసన

అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్‌షా గోబ్యాక్

- వామపక్షాల నిరసన

ఏలూరుకార్పొరేషన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో డాక్టర్ అంబేడ్కర్‌ను అవమానిస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల నాయకులు నిరసన తెలిపారు. ఆదివారం ఏలూరు పాతబస్టాండ్ సెంటర్‌లో వామపక్షాల ఆధ్వర్యంలో అమిత్‌షా గోబ్యాక్ అంటూ నిరసన చేపట్టారు. వామపక్షాల నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానపరిచిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని, లేకుంటే కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. వామపక్షాల నాయకులు ఎ.రవి, బద్దా వెంకట్రావు, నంబూరి శ్రీమన్నారాయణ, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, పిచ్చుక ఆదిశేషు, ఎ.శ్యామలారాణి, రామాంజనేయులు, ఎస్.సత్యనారాయణ, యేసుబాబు, ఎం.సత్యనారాయణ, ఈమని మల్లిక, కాకి నాని, మహర్షి, ఈ.రాంబాబు, తదితరులు ఉన్నారు.

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు

ద్వారకాతిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్తాల చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గత కొన్నాళ్లుగా కొందరు వ్యక్తులు మట్టిని తవ్వి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాల వైపు ఏ అధికారి కన్నెత్తి చూడడం లేదు. ఈ మట్టిని భీమవరం, కైకలూరు, భీమడోలు, తదితర ప్రాంతాల్లోని రియల్ ఎస్టేట్‌లలో మట్టి చదును చేసుకు నేందుకు తరలిస్తున్నట్లు సమాచారం. దూరానికి అనుగుణంగా ఈ మట్టిని టిప్పర్ రూ.5వేలు నుంచి రూ.10 వేల వరకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దాదాపు ముప్పై ఎకరాల్లో ఉన్న ఈ చెరువు తవ్వకాల కారణంగా నిజ ఆకృతిని కోల్పోయి గుంతలు పడిపోతుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ తవ్వకాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.


సత్తాలలో మట్టి తవ్వకాల దృశ్యం

ఆధ్యాత్మికం

శ్రీవారి క్షేత్రంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, జనవరి 19(ఆంధ్రజ్యోతి): చిన్నతిరుమలేశుని దివ్యక్షేత్రం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అందరికీ సెలవు రోజు కావడంతో ఆలయానికి యాత్రికులు సుమారు 12 వేల మంది వరకు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


క్యూకాంప్లెక్స్ వద్ద వేచి ఉన్న భక్తులు

- **భక్తుడికి వాచీ అప్పగింత**

శ్రీవారి దర్శనానికి విశాఖపట్నం నుంచి వచ్చిన సూర్య అనే భక్తుడు వచ్చి డార్మెటరీలో బసచేసి దాదాపు రూ. 30 వేల విలువైన వాచీని మర్చిపోయి స్వగ్రామం వెళ్లిపోయాడు. ఆ వాచీని సెక్యూరిటీ సిబ్బంది సతీష్, శ్రీనివాస్ గుర్తించి అతడి ఫోన్ నంబరు ద్వారా తెలియజేసి అతడికి అందించి నిజాయితీని చాటుకున్నారు

- **గుబ్బల మంగమ్మ సన్నిధిలో..**

బుట్టాయగూడెం : మన్యం బిడ్డల ఆరాధ్య దైవం గుబ్బల మంగమ్మతల్లి అమ్మవారి ఆలయం అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ సెలవులు ఆదివారంతో ముగుస్తుండటంతో అమ్మవారిని దర్శించుకోడానికి భక్తులు పిల్లలతో కలిసి అత్యధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి అమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు.

- **శ్రీరాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు**

పెదవేగి : పెదవేగి మండలం రాట్నాలకుంట రాట్నాలమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాలపొంగలి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.42,720, లడ్డూ ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 21,750, ఫొటో విక్రయాల ద్వారా రూ.3475 ఆదాయం వచ్చిందని ఈవో ఎన్.సతీష్‌కుమార్ తెలిపారు.

- **శ్రీవారి సన్నిధిలో దర్బార్ సేవ**

ఏలూరు కార్పొరేషన్ : రామచంద్రరావుపేటలో గల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గతనెల 28 నుంచి ఈనెల 18వ తేదీ వరకు శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిసిన నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలోని వేదిక వద్ద ఆదివారం అర్చక బృందం దర్బార్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఇంటర్వ్యూ..

జల్లేరు జలాశయం అభివృద్ధికి కృషి


సోదెం మల్లారావు
జల్లేరు జలాశయం సాగునీటి సంఘ అధ్యక్షుడు

- **జల్లేరు జలాశయం అభివృద్ధికి చర్యలేవి ?**

జవాబు : సుమారు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. ఈ ఏడాది నిధులు విడుదలయ్యాయని అధికారులు తెలిపారు. త్వరలోనే పనులు చేపడతాం.

- **జలాశయం ఆయకట్టు పరిధి ఎంత ?**

జవాబు : వాస్తవంగా 4200 ఎకరాలు ఉండగా ప్రస్తుతం 1500 నుంచి 2000 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది.

- **కాల్వల పరిస్థితి ఎలా ఉంది?**

జవాబు : జలాశయానికి రెండు కాల్వలు ఉన్నా ఎడమ కాల్వ పరిధిలోనే అధికంగా పంట భూములు ఉన్నాయి. శివారు భూములకు సాగునీరు అందక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

- **జలాశయం గేట్ల పరిస్థితి ఏమిటి ?**

జవాబు : జలాశయానికి ఉన్న రెండు గేట్లు పూర్తిగా పాడైపోయాయి. ఎప్పటి నుంచో మరమ్మతులు లేవు. గేట్లను దించాలన్నా, పైకి ఎత్తాలన్నా వీలుకావడం లేదు. గేట్లకు ఉన్న రబ్బర్లు ఊడిపోవడంతో నీరు వృథాగా పోతుంది.

(ఆంధ్రజ్యోతి-బుట్టాయగూడెం)


కలెక్టర్ చేతుల మీదుగా ప్రోత్సాహాన్ని అందుకున్న రైతు గద్దే రత్నాజి

చిన్న, సన్నకారు రైతులను ప్రోత్సహిస్తాం : కలెక్టర్

ఉంగుటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని చిన్న, సన్నకారు రైతాంగానికి పలు రకాల ప్రోత్సాహకాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. శనివారం రాత్రి ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉంగుటూరుకు చెందిన రైతు గద్దే రత్నాజికి ప్రోత్సాహక బహుమతిని ఆమె అందించి మాట్లాడారు. విద్యుత్తు సబ్సిడీ అందించడంతో పాటు సొంతంగా వ్యవసాయం చేసుకుంటూ మార్కెటింగ్ చేసుకుంటున్న వారికి నాబార్డు ద్వారా రుణాలు అందిస్తామన్నారు. డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ జిల్లా సంయుక్త డైరెక్టర్లు మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సాగు పట్టాలివ్వాలి

లింగపాలెం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా పోరంబోకు, గయ్యాళి, అటవీ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సాగుపట్టాలు మంజూరు చేయాలని దళితసేన అధ్యక్షుడు రవిప్రకాష్ డిమాండ్ చేశారు. ఆదివారం ధర్మాజీగూడెంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శికాఖొల్లు స్టాలిన్, పింగుల ఇదియాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పోరంబోకు, అటవీ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఎస్సీఎస్టీ, బీసీలకు సాగుపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయం సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కొప్పుల నాగేంద్ర, లక్కపాము దాసు, శికాఖొల్లు మోహన్‌రావు, పలువురు దళిత నేతలు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు ఆదర్శనీయం

ఉంగుటూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ చేబ్రోలు, హేలాపురి లయన్స్ సంయుక్త ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం గొల్లగూడెంలో ఇంజనీర్ బొమ్మిరెడ్డిపల్లి రంగారావు ఆర్థిక సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 120 మందికి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందించారు ఏలూరు కామినేని ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కొడాలి రామ్‌ప్రసీన్, గుండె సంబంధిత పరీక్షలు జరిపారు. హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.వి.రమణ, చేబ్రోలు లయన్స్ అధ్యక్షుడు పుసులూరి ప్రకాశ్, సభ్యులు బొమ్మిరెడ్డిపల్లి రంగారావు, గుణ్ణం బుల్లెబ్బాయి, వంకిన ప్రతాప్, శీతాల సత్యనారాయణ, శాఖమూడి మురళీకృష్ణ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

భీమడోలు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలనులోని సీతారామస్వామి ఆలయంలో వున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ఘనంగా ఆదివారం జరిగాయి. స్వామి వారి ఉపాలయంలో త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా సీతారామస్వామి వారికి త్యాగరాజస్వామి వారికి అభిషేకాలు నిర్వహించి సీతారామస్వామి వారికి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రొయ్యల వ్యాపారి కిడ్నాప్ కేసులో ఏడుగురి అరెస్ట్

పరారీలో ఐదుగురు

ఆయుధాలు, ఫోన్లు స్వాధీనం

నగదు లావాదేవీలే కారణం

భీమవరం క్రైం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద ఈ నెల 16వ తేదీన కిడ్నాప్‌కు గురైన విశ్వనాథుని వెంకట సత్యనారాయణ (నాని) కేసును కొద్ది గంటల్లోనే ఛేదించి ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన వెంకట సత్యనారాయణకు సోమిశెట్టి సత్యప్రసాద్, యిన్నమూరి లక్ష్మీ వెంకట మల్లికార్జున సురేష్‌బాబులకు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయి. వెంకట సత్యనారాయణ కొందరి వద్ద డబ్బులు తీసుకుని అవి వేరే వ్యాపారస్తులకు ఇచ్చి కమీషన్ తీసుకునేవాడు. ఆ కోవలోనే పై ఇద్దరి నుంచే కాకుండా వారి బంధువుల వద్ద సుమారు 3 కోట్ల వరకు అప్పు తీసుకున్నాడు. ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ ఇచ్చి తిరగ రాసేవాడు. కరోనా సమయం నుంచి వడ్డీగాని, అసలు గాని చెల్లించడం లేదు. దీంతో 2021 సంవత్సరంలో తిరగ రాయడంతో మొత్తం వడ్డీతో సహా రూ.10 కోట్ల 70 లక్షల వరకు ఇవ్వవలసి వచ్చింది. దీంతో సత్యప్రసాద్, సురేష్‌బాబులు డబ్బులు ఇవ్వమని ఒత్తిడి చెయ్యడం మొదలుపెట్టారు. డబ్బులు ఇవ్వకపోతే చంపుతామని కూడా బెదిరించారు. సత్యనారాయణ సమాధానం చెప్పకపోవడంతో ఎలాగైనా డబ్బులు రాబట్టాలని పన్నాగం పన్నారు.

కిడ్నాప్ ప్లాన్..

అనంతపురంలో సత్యప్రసాద్‌కు తెలిసిన కాకతీయ రెస్టారెంట్ యజమాని ఆశిష్‌తో ఈ విషయాన్ని తెలిపాడు. ఆశిష్ తనకు తెలిసిన లోకేష్ అనే వ్యక్తిని పరిచయం చేశాడు. లక్షల్లో డబ్బులు ఇస్తామని చెప్పడంతో లోకేష్ కిడ్నాప్‌కు ప్లాన్ వేశాడు. దీంతో కొంత మందిని కిడ్నాప్ చెయ్యడానికి పురమాయించాడు. రెండు కార్లలో ఈ నెల 15వ తేదీన భీమవరం వచ్చి రెక్కీ నిర్వహించారు. 16వ తేదీన వెంకట సత్యనారాయణ టౌన్ రైల్వే స్టేషన్‌కు రావడం చూసి కారులో వచ్చిన కొందరు సఫారీలో వచ్చి ఇంటిలిజెన్స్ పోలీసులమని సత్యనారాయణను కారులో తీసుకువెళ్ళారు. దీంతో బాధితుడి కుమారుడు సాయినాథ్ ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కాళీచరణ్ దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాల ద్వారా వారు తీసుకువెళ్ళిన కారు అనంతపురం వెళ్ళిందని తెలుసుకుని అక్కడ పోలీసులను అలెర్ట్ చేశారు. అయితే వెంకట సత్యనారాయణను హత్య చేసి అయినా తమ డబ్బులు రాబట్టాలని సత్యప్రసాద్, సురేష్‌బాబులు కిడ్నాపర్లకు చెప్పడంతో మారణాయుధాలు తీసుకువచ్చి హత్య చేస్తామని అనడంతో తనను భీమవరం తీసుకువెళితే తనకు ఉన్న ఆస్తిని అమ్మి అయినా డబ్బులు ఇచ్చేస్తానని చెప్పడంతో మూడు కార్లలో సత్యనారాయణను ఈనెల 18వ తేదీన భీమవరం తీసుకువచ్చారు. భీమవరం గరగపర్రు రోడ్‌లో ఖాళీ ప్రదేశంలో నిలబెట్టి వారందరూ చుట్టుముట్టి బెదిరిస్తూ ఉండటంతో పోలీసులు అక్కడకు వెళ్ళి ఏడుగురిని అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. వారి వద్ద ఉన్న మూడు కార్లు, తొమ్మిది ఫోన్లు, ఒక డైరీ, ఒక వాకీటాకీ, ఒక కత్తి, మూడు వికెట్లు, రెండు హాకీ స్టిక్కులు, ఒక ఆధార్ కార్డు స్వాధీనం చేసుకున్నారు. సీఐలు కాళీచరణ్, శ్రీనివాసరావు, నాగరాజు, ఎస్ఐలు రెహ్మాన్, ఇజ్రాయేల్, గోపి, నరేష్, గోవింద్‌రావు తదితరులు ఉన్నారు.



ఖైదీల పరిస్థితులను తెలుసుకుంటున్న అదనపు జిల్లా జడ్జి నాగశైలజ

జైల్లో ముద్దాయిలకు ఉచిత న్యాయ సేవ

నూజివీడు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక స్తోమతలేని ముద్దాయిలకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయ సేవను అందిస్తున్నట్టు 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగ శైలజ తెలిపారు. నూజివీడు సబ్ జైల్‌ను అదనపు జిల్లా జడ్జి నేతృత్వంలోని న్యాయ మూర్తుల బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా ఖైదీల సమస్యలు, ఆరోగ్య పరమైన అంశాలను వారికి అందిస్తున్న భోజన సదుపాయాలను ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో 2వ అదనపు మేజిస్ట్రేట్ ఎం.శివపార్వతి, నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్, డీఎస్పీ ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు మృతికి నివాళి

నూజివీడు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రిగా, ఎమ్మెల్సీగా నూజివీడు నియోజకవర్గ అభివృద్ధిలో పాలడుగు వెంకట్రావు కృషి మరువలేనిదని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నూజివీడు నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పరిమి సాగర్ కుమార్ అధ్యక్షతన వెంకట్రావు 10వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బి.డి. రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాల కోసం జీవితాంతం పని చేసిన వ్యక్తి పాలడుగు వెంకట్రావు అని అన్నారు. ఆర్.ఎస్.ఎస్ అజెండాతో పని చేస్తున్న బీజేపీ దేశానికి ప్రమాదకరమని, గతంలో బ్రిటీషర్లకు తొత్తులుగా పనిచేసిన వారు నేడు దేశభక్తులుగా చెలామణవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ జనరల్ సెక్రటరీ పాలడుగు నాగభరత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్య దేవర ప్రసాద్, యార్లగడ్డ అంజనేయులు, పల్లెపాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఆటపాకలో ఘనంగా శ్రీ గంగానమ్మ జాతర

కైకలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): గంగానమ్మ జాతరను భక్తులు వైభవంగా జరుపుకున్నారు. ఆదివారం కైకలూరు మండలం ఆటపాకలో కొలువైన శ్రీగంగానమ్మ ఆలయ 11వ వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా భక్తులు అమ్మవారికి చలివిడి నైవేద్యాలను సమర్పించారు. అనేకమంది భక్తులు తమ మొక్కు బడులను చెల్లించుకుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ జాతరను పురస్కరించుకుని జనసేన పార్టీ ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణ, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించగా కైకలూరు టౌన్ ఎస్సై డి.వెంకట కుమార్ బందోబస్తు నిర్వహించారు.



మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కలిదిండి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కోరుకొల్లు జడ్పీ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1999 - 2000లో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోటకు చేరి తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులకు ఆత్మీయ సత్కారాలు నిర్వహించుకున్నారు.. తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు 2 లక్షల రూపాయలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నరహరిశెట్టి బ్రహ్మాజీ, నున్న సుబ్రహ్మణ్యం, చెన్నంశెట్టి వీర వెంకటేశ్వరరావు, యర్రంశెట్టి నాగ సుబ్రహ్మణ్యం, కె.నాగార్జున, కాండ్రేకుల కృష్ణ, సి.హెచ్. రమేష్, అందె కుమార స్వామి, చలమలశెట్టి భాగ్యలక్ష్మి, బి.లక్ష్మీ మంగతాయారు పాల్గొన్నారు.

మండవల్లిలో సందడి..

మండవల్లి జనవరి 19(ఆంధ్రజ్యోతి): మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 2013-15 బ్యాచ్ విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బేతపూడి రవితేజ, అప్పటి అధ్యాపకులు ఎం.శ్రీనాథ్, షేక్ పాషా, పి.దాతేశ్వరరావు, కె. రాంబాబులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్‌గా వ్యవహరించిన సి.హెచ్. భార్గవి పలువురు అభినందించారు. ఆటపాటలతో అంతా కళాశాల ఆవరణలో ఆనందోత్సాహాల మధ్య పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు.



కోరుకొల్లు జడ్పీ హైస్కూల్లో 1999-2000లో టెన్త్ చదివిన విద్యార్థులు

ఆదమరిస్తే.. అంతు చూస్తాయ్..

» చాట్రాయి మండలంలో ప్రమాదకరంగా రోడ్డు మలుపులు
» కొంపముంచుతున్న అతివేగం » స్పీడ్ బ్రేకర్లకు నో చాన్స్
» హెచ్చరిక బోర్డుల కోసం వాహనదారుల వేడుకోలు



చాట్రాయి బాల్ చెరువు దగ్గర డేంజర్ మలుపు

చాట్రాయి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం చాట్రాయిలోని పలు రోడ్లపై ఉన్న మలుపులు ప్రమాదకరంగా మారడంతో వాహన చోదకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పవర్‌పేట, సచివాలయం, మెయిన్ సెంటర్, బాల్ చెరువు వద్ద రోడ్డు మలుపులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. రోడ్లు బాగా ఇరుకుగా ఉండటం, మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడం, అతివేగం కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మైనర్లు, యువకులు వీధి రోడ్లు, ఇరుకు రోడ్లు అని చూడకుండా వాహనాలను వేగంగా నడపడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఎటునుంచి ఏ వాహనం వచ్చి ఢీ కొడుతుందోనని వణికిపోతున్నారు.

రద్దీ కారణంగా...

ఏలూరు - ఎన్టీఆర్ జిల్లాలను కలిపే రహదారిలో చాట్రాయి ఉండటం వలన నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేకి చాట్రాయి మీదుగానే టన్నుల కొద్దీ బరువైన లోడుతో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సింగిల్ రోడ్డు అయినప్పటికీ భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నందు వల్ల పరిస్థితి మరింత జఠిలంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుందో అని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మలుపుల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.



చాట్రాయి పవర్‌పేట వద్ద ప్రమాదకర రోడ్డు మలుపు

చర్యలు తీసుకుంటాం

నిబంధనల ప్రకారం స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు అవకాశం లేదు. నిధులు మంజూరైతే రోడ్డు మలుపుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. అలాగే వాహనదారులు సైతం ప్రమాదాల బారిన పడకుండా ట్రాఫిక్ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలి.

బాబూరావు, డీఈఈ,
ఆర్‌అండ్‌బీ శాఖ, నూజివీడు



చాట్రాయి టెలిఫోన్ ఆఫీసు వద్ద డేంజర్ మలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి

కాట్రేనిపాడులో 26న మాదిగ ఉత్సవ్

ముసునూరు, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడు అటవీ ప్రాంతంలోని మాదిగ కొండపై జరిగే మాదిగ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు, ఉత్సవ కమిటీ ఛైర్మన్ గురువిందపల్లి చిట్టిబాబు మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం నూజివీడు టీడీపీ క్యాంప్ కార్యాలయంలో మాదిగ ఉత్సవ్ - 2025 వాల్ పోస్టర్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మట్లాడుతూ ఈ నెల 26వ తేదీన జరిగే ఉత్సవానికి ఉమ్మడి కృష్ణా జిల్లాల నుంచి వేలాదిగా మాదిగ సోదరులంతా తరలిరావాలని ఆయన కోరారు. ఈ ఉత్సవానికి అతిరథ మహారథులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్టు చిట్టిబాబు తెలిపారు.



ఆలయ ప్రాంగణంలో భక్తులు

పెద్దింటి అమ్మవారి ఆలయంలో భక్తుల కిటకిట

కైకలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని దర్శించుకున్నారు. సంక్రాంతి సెలవులు చివరి రోజు కావడంతో ఆదివారం భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఏలూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు పాల పొంగళ్ళను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించగా పలువురు కోళ్ళు, గొర్రె, పొట్టేళ్లను మొక్కుబడులుగా చెల్లించుకున్నారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేటి నుంచి ఉచిత పశు వైద్య శిబిరం

ముదినేపల్లి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 31 వరకు ముదినేపల్లి మండలంలో ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. ఈనెల 20న ముదినేపల్లి, బొమ్మినంపాడు, 21న గురజ, అల్లూరు, 22న కొరగుంటపాలెం, పెనుమల్లి గ్రామాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. 31వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో నిర్వహించే పశు వైద్య శిబిరాలను సద్వినియోగించుకోవాలని ముదినేపల్లి, ప్రొద్దువాక వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ ఆరేపల్లి రామకృష్ణ తెలిపారు. శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడంతో పలు రకాల పశువైద్య సేవలను అందిస్తామన్నారు.

కలిదిండిలో స్వచ్ఛ దివస్

కలిదిండి, జనవరి 19(ఆంధ్రజ్యోతి): కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకుల ఆధ్వర్యంలో స్వచ్ఛ దివస్ నిర్వహించారు. కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.త్రినాథ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



వేగా టీంకు నగదు, మెమెంటో అందజేస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

కైకలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో యువత ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమని ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ కొనియాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కైకలూరు టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు ఆదివారం కైకలూరు వైవీఎన్నార్ డిగ్రీ కళాశాలలో బహుమతులను డీఎస్పీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సమయంలో యువత జూదం వైపు మళ్లకుండా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 45 బృందాలు పాల్గొనడం హర్షణీయమన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి వేగా టీం, ద్వితీయ బహుమతి మండవల్లి టీం, మూడవ బహుమతి డేంజర్ బాయ్స్ అండర్ 19 విజేత వింజరం బాయ్స్ సాధించారు. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ మండవల్లి సాంబా అందుకోగా బెస్ట్ బౌలర్‌గా గోనెపాడుకు చెందిన నాగరాజు బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ పి.కృష్ణ, ఎస్సైలు వి.వెంకట కుమార్, ఆర్.శ్రీను, కూటమి నాయకులు బూరుబోయిన శ్రీనివాసరావు, రామిశెట్టి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

సంతోషపురం మాజీ సర్పంచ్‌ది హత్యే

» మారణాయుధాలు స్వాధీనం » హత్య కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ

కైకలూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : పక్కా ప్రణాళిక ప్రకారమే సంతోషపురం మాజీ సర్పంచ్ హత్య జరిగినట్టు ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం కైకలూరు రూరల్ సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలను డీఎస్పీ మీడియాకు వెల్లడించారు. కలిదిండి మండలం సంతోషపురం గ్రామ మాజీ సర్పంచ్ కాలవ నల్లయ్య(58) కలిదిండి గ్రామంలో నివాసం ఉంటున్నారు. స్వగ్రామంలో నల్లయ్యకు 15 ఎకరాల చేపలచెరువు ఉంది. అదే గ్రామానికి చెందిన బోదనపు శ్రీనివాసరావుతో చెరువు బోదె విషయంలో నల్లయ్యకు గొడవలు జరుగుతున్నాయి. నల్లయ్య వల్ల పదే పదే సమస్యలు తలెత్తడంతో హతమార్చాలని శ్రీనివాసరావు ప్రణాళిక సిద్ధం చేశాడు. అనుకున్నదే తడువుగా ఈ నెల 16న నల్లయ్య బైక్‌పై చెరువు నుంచి కలిదిండి వస్తుండగా శ్రీనివాసరావు ఎదురుగా బైక్‌పై వచ్చి బలంగా ఢీ కొట్టాడు. నల్లయ్య కింద పడిపోవడంతో వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్డుతో మెడపై బలంగా కొట్టడమే కాకుండా కత్తితో పలుమార్లు దాడి చేసినట్టు డీఎస్పీ తెలిపారు. అనంతరం ఎవరో వస్తున్న అలికిడి రావడంతో అక్కడి నుంచి శ్రీనివాసరావు పరారవ్వగా, రక్తపు మడుగులో ఉన్న నల్లయ్యను స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు డీఎస్పీ తెలిపారు. దర్యాప్తు అనంతరం పరారీలో ఉన్న శ్రీనివాసరావును ఆదివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నట్టు స్పష్టం చేశారు. సమావేశంలో కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్, కలిదిండి ఎస్సై వి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

అమిత్ షా పర్యటనకు వ్యతిరేకంగా సీపీఎం నిరసన

ముసునూరు, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం ఏలూరు జిల్లా నాయకులు జి.రాజు డిమాండ్ చేశారు. అమిత్ షా ఏపీ పర్యటనకు వ్యతిరేకంగా ఆదివారం ముసునూరులో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించి, అన్ని రంగాల్లో ముందుండేలా అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తిని అవమానించడం ఘోరమన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు కొడవలి శ్రీనివాస్, మానికల ఐత్రైంరాజు, కె.దుర్గారావు, పిల్లి మురళీ, గంగుల సత్యం, కె.కుటుంబరావు, పాల్గొన్నారు.



ముసునూరులో సీపీఎం నాయకుల నిరసన

గాంధీ బొమ్మ సెంటర్ లో...

నూజివీడు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ రూపకర్త అంబేడ్కర్‌ను అవమానించిన అమిత్ షాను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం ఆందోళన చేపట్టింది. ఈ మేరకు అమిత్ షా ఏపీ పర్యటనను వ్యతిరేకిస్తూ ఆదివారం నూజివీడు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ అంబేడ్కర్‌ని పార్లమెంట్‌లో అవమానించేలా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాకి రాష్ట్రంలో స్వాగతం పలకడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్లు, సీపీఎం మండల కార్యదర్శి పాలేటి సుభాష్ చంద్రబోస్, నాయకులు పాపారావు, మరియ దాసు, రాంబాబు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నియామక దరఖాస్తుల గడువు పెంపు

నూజివీడు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : రేషన్ డీలర్ల నియామక దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్టు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్ తెలిపారు. నూజివీడు డివిజన్ పరిధిలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాలకు శాశ్వత ప్రాతిపదికన డీలర్ల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ తుది గడువును ఈనెల 22వరకు పొడిగిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు నూజివీడు సబ్ కలెక్టర్, మండల తహసీల్దార్ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

నూజివీడు టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ నూజివీడు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నూజివీడు కనకం కల్యాణ మండపంలో వాసవీ క్లబ్ నూజివీడు అధ్యక్షులుగా గాదె శివరామకృష్ణారావు, కార్యదర్శిగా చిట్లూరి కిషోర్‌కుమార్, కోశాధికారిగా చలువాది రామకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ మామిడి శ్రీనివాసరావు, జిల్లా గవర్నర్ అన్నం సాయి సునీత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

టీడీపీ సీనియర్ నాయకులు సత్యనారాయణ మృతి



సత్యం (ఫైల్)

నూజివీడు టౌన్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, తిరుమలశెట్టి సత్యనారాయణ(సత్యం) (72) శనివారం రాత్రి మృతి చెందారు. టీడీపీ నూజివీడు నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులుగా, జిల్లా కమిటీ సభ్యులుగా ఆయన పని చేశా రు. ఆవిర్భావం నుంచి టీడీపీకి విశేషమైన సేవలందించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శనివారం విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. స్వగ్రామం వచ్చిన తిరుమలశెట్టి సత్యనారాయణ భౌతికదేహాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, నూజివీడు సీనియర్ తెలుగుదేశంపార్టీ నాయకులు నూతక్కి. వేణు గోపాల్‌రావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

వైభవంగా త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు

నూజివీడు టౌన్, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలను నూజివీడులో వైభవంగా నిర్వహించారు. నూజివీడు అమర్ భవన్‌లో ఆదివారం ఉదయం నుంచి ఈ ఆరాధనోత్సవాలను చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి కృష్ణా జిల్లా, తెలంగాణలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాల నుంచి అనేక మంది హాజరై సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు నిర్వహించారు.

పాడి రైతులకు బోనస్

చాట్రాయి, జనవరి 19(ఆంధ్రజ్యోతి) : చీపురుగూడెం పాల సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని సంస్థ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, క్లస్టర్ మేనేజర్ సాంబశివ మూర్తి పేర్కొన్నారు. సబ్సిడీ ప్రయోజనాలపై చాట్రాయి మండలం చీపురుగూడెంలో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్, క్లస్టర్ మేనేజర్లు మాట్లాడుతూ సంఘం సభ్యులకు 2 లక్షలు 40 వేల రూపాయల బోనస్ అందజేసినట్టు తెలిపారు. అనంతరం పశువులకు కాల్షియం ఉపయోగాలు, ఎలిక పాముల నివారణ, వ్యాధి నిరోధక టీకాలు, ఉచితంగా ఇచ్చే గడ్డి కణుపులు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నరశింహారావు, వేతన కార్యదర్శి రాంబాబు, సంఘ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.